క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: స్థానిక 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని అన్ని గ్రామాలకూ కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. వ్యవసాయ పంపు సెట్లకు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 9 గంటల వరకూ తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా ఇస్తామని చెప్పారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

నిడదవోలు రూరల్: వర్షాకాలం నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలని మండల వైద్యాధికారి ఎం.శివాజీ సూచించారు. మండలంలోని తాళ్లపాలెం, సింగవరం గ్రామాల్లోని ఎర్ర కాలువ ముంపు గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను బుధవారం ఆయన పరిశీలించారు. అంటు వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓ ఎ.రాజమోహన్, మురళి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రెయిన్ కోట్స్ పంపిణీ



రెయిన్ కోట్స్ పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

నిడదవోలు: స్థానిక చర్చిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో బుధవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఇందుకు లయన్ రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జేష్ట వెంకటేశ్వరరావు, కోశాధికారి బండి రాంగోపాల్, మాజీ కౌన్సిలర్ జువ్వల రాంబాబు, పాఠశాల హెచ్ఎం బి.వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ నేత 'అయ్యంకి'కి నివాళి



ఉండ్రాజవరంలో అయ్యంకి వెంకట రమణయ్య చిత్ర పటానికి నివాళులు

ఉండ్రాజవరం: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని బుధవారం ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు మాట్లాడుతూ వెంకటరమణయ్య జిల్లాలోని బిక్కవోలు మండలం, కొంకుదురు గ్రామంలో 1890 జూలై 24న జన్మించారన్నారు. 1993–1948 మధ్య కోస్తా ఆంధ్ర ప్రాంతంలో అనేక గ్రంథాలయాలు ఏర్పాటు చేశారన్నారు. తొలుత అయ్యంకి చిత్ర పటానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠకులు పెరుమాళ్ల సత్యనారాయణ మూర్తి, పాతూరి సుబ్బయ్య, టి.రాజేంద్రప్రసాద్, ఆర్.సుబ్బారావు, పీవీడీ ప్రసాద్, టి.సతీష్ పాల్గొన్నారు.

పెరవలిలో..

పెరవలి: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని మండలంలోని ముక్కామల, పెరవలి, తీపర్రు శాఖా గ్రంథాలయాల వద్ద బుధవారం నిర్వహించారు. ముక్కామలలో అయ్యంకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇక్కడ నిర్వహించిన సభలో అయ్యంకి అవార్డు గ్రహీత సలాది సూర్యనారాయణ తన ప్రసంగంలో రాష్ట్రంలో గ్రంథాలయాల ఏర్పాటుకు అయ్యంకి జరిపిన కృషిని వివరించారు. పెరవలి, తీపర్రు గ్రంథాలయాల్లో అయ్యంకి వెంకటరమణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, లైబ్రేరియన్‌లు వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కానూరు డ్రైన్‌లో పూడిక తొలగింపు



మురుగు డ్రైన్‌లో పూడిక తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

పెరవలి: మండలంలోని కానూరు గ్రామంలో మురుగునీటి పారుదలకు వీలుగా బుధవారం డ్రైన్‌లో పూడిక తొలగించారు. మంగళవారం ఈ గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.హిమమహేశ్వరి మాట్లాడుతూ బుధవారం సాయంత్రానికే మురుగునీరు దిగువకు ప్రవహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పొక్లెయిన్ సాయంతో తవ్వకాలు చేపట్టామని తూరల్లో ఉన్న మట్టిని మనుషులతో తీయించామని వివరించారు.



ముంపులో ఉన్న కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం ఆవరణ



కొవ్వూరు మండలం పెనకనమెట్టలో ముంపులో ఉన్న కూరగాయల పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శ్రీనివాస్



పెరవలి మండలం మల్లేశ్వరంలో గోదావరి లంక నుంచి బొప్పాయి కాయలను ఒడ్డుకు తెచ్చిన రైతు



పెరవలి మండలం ముక్కామలలో నీట మునిగిన బెండతోట

అన్నదాత శ్రమ వర్షార్పణం

- ముంపులో డివిజన్‌లోని 12,361 ఎకరాల్లోని పంటలు
- నీట మునిగిన 453.48 హెక్టార్లలోని ఉద్యాన పంటలు
- నెమ్మదిస్తున్న గోదావరి వరద
- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో హెచ్చరిక

కొవ్వూరు: భారీ వర్షాలు, గోదావరి వరదతో కొవ్వూరు డివిజన్‌లోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాల కారణంగా వారం రోజులుగా పంటలు ముంపులోనే నానుతున్నాయి. ప్రధానంగా వరి సాగుదారులను ఈ వర్షాలు నిండా ముంచాయి. కొవ్వాడ, ఎర్ర, రాళ్ల మడుగు కాలువల వరద వల్ల అధిక నష్టం వాటిల్లింది. ఎర్ర కాలువ ప్రభావంతో నిడదవోలు మండలంలో గరిష్ఠంగా వరి పంట ముంపు బారిన పడింది. ఉండ్రాజవరం మండలంలో 5 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. కొవ్వూరు డివిజన్ పరిధిలో 12,361.4 ఎకరాల్లో వివిధ పంటలు ముంపు బారిన పడినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉద్యాన పంటలు 453.48 హెక్టార్లు (సుమారు 1129 ఎకరాలు) ముంపులో ఉన్నాయని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కూరగాయల రైతులకు తీరని నష్టం వాటిల్లింది. రెండు రోజులుగా వర్షం కాస్త తగ్గుముఖం పట్టడం, బుధవారం మధ్యాహ్నం నుంచి గోదావరి వరద నెమ్మదిస్తుండడం రైతులకు కాస్త ఊరట కలిగించే విషయం. ఇప్పటికీ డివిజన్ వ్యాప్తంగా ఉద్యాన, వ్యవసాయ పంటలు కలిపి దాదాపు 13,486 ఎకరాల్లో ముంపులో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వర్ష ప్రభావం, వరద తీవ్రత నెమ్మదిస్తుండడంతో నష్ట తీవ్రత నుంచి రైతులు గట్టెక్కనున్నారు. లేదంటే పంట నష్టాల తీవ్రత మరింత పెరిగేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



కొవ్వూరు శివార్లలో వరద ముంపులో చిక్కుకున్న పంటలు

ముంపులో ఉన్న పంటల వివరాలివీ..

డివిజన్ పరిధిలో ఇంకా పంటలు ముంపులోనే ఉన్నాయి. ప్రధానంగా నలభై ఎకరాల్లో చెరకు, 12,320 ఎకరాల్లో వరి పంటలు ముంపులో ఉన్నట్టు అధికారులు తెలిపారు. మండలాలవారీగా కొవ్వూరులో 520, చాగల్లులో 250 ,దేవరపల్లిలో 870, గోపాలపురంలో 898, తాళ్లపూడిలో 606.5, నిడదవోలులో 3,412, ఉండ్రాజవరంలో 5 వేలు, పెరవలిలో 386, నల్లజర్లలో 437 ఎకరాల్లో పంటల ముంపులో ఉన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారు.

43 గ్రామాల్లోని ఉద్యాన పంటలకు

కొవ్వూరు డివిజన్‌లోని 43 గ్రామాల పరిధిలోని 704 మంది రైతులకు చెందిన 453.48 హెక్టార్లలోని ఉద్యాన పంటలు ముంపు బారిన పడ్డాయి. వారం రోజులుగా అవి నీటిలో నానుతున్నాయి. ప్రధానంగా అరటి, కూరగాయాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలాలవారీగా కొవ్వూరులో 67, నిడదవోలులో 193, దేవరపల్లిలో 9.20, గోపాలపురంలో 4.20, తాళ్లపూడిలో 31.40, నల్లజర్లలో 6.68, ఉండ్రాజవరంలో 10, చాగల్లులో 30 హెక్టార్లలోని ఉద్యాన పంటలు ముంపు బారిన పడినట్టు అధికారులు గుర్తించారు. ఇక గోదావరి లంక భూములు ఎక్కువగా ఉన్న పెరవలి మండలంలోని రెండు గ్రామాల పరిధిలోని 160 మంది రైతులకు చెందిన 100 హెక్టార్లలోని ఉద్యాన పంటలు వరద ముంపులో ఉన్నాయి.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: గోదావరి వరద ఉధృతి మండలంలో నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహం బుధవారం మండలంలో వరద లంకలకు అనుకుని ప్రవహిస్తోంది. వరదకు లంక భూముల్లోని పల్లపు ప్రాంతాల్లోని పలు రకాల పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. వేగేశ్వరపురంలో మేరీమాత ఆలయం మెట్ల వద్దకు వరద నీరు చేరింది. ఈ గ్రామంలోని గోదావరి లంకల్లో సాగు చేస్తున్న బెండ, వంగ, కంద, ఆకుకూరల వంటి పంటలు ముంపులో చిక్కుకున్నాయి. వరద వల్ల గోదావరిలో చేపల వేటకు అంతరాయం కలిగింది. మత్స్యకారులు తమ పడవలను ఒడ్డున కట్టేశారు. ప్రజలెవరూ నదిలోకి దిగకుండా ప్రభుత్వ సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు.

జల దిగ్బంధంలో లంకలు

పెరవలి: ఎగువన గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ దిగువన పెరగడంతో నది తీర ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. ఇప్పటికే పంటలు నీట మునిగి ఉండడం, గోదావరి పెరగడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నుంచి మంగళవారం 13 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు బుధవారం 14.56 లక్షల క్యూసెక్కులు వదలడంతో లంక భూముల్లోని పంటలన్నీ నీట మునిగి ఉన్నాయి. కూరగాయల పంటలు కుళ్లిపోగా కంద, పసుపు పనికి రావని రైతులు చెబుతున్నారు. అరటి తోటలు మిగిలి ఉన్నా గెలలకు మట్టి ఉండడం వల్ల మార్కెట్‌లో ధర లభించదంటున్నారు. పూలతోటలు, ఆకుకూరలు, పచ్చిమిరపతోటలు నామరూపాలు లేకుండా పోతాయని చెబుతున్నారు.లంక భూముల్లోని నీరు పూర్తిగా లాగడానికి వారం రోజుల సమయం పడుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. నీటమునిగిన గోదావరి లంకల్లో రైతులు పడవల సాయంతో అరటి గెలలు, బొప్పాయి కాయలు కోసి ఒడ్డుకు తరలిస్తున్నారు.

ముంపులోనే గోష్పాదక్షేత్రం

కొవ్వూరు: గోదావరి నదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. పట్టణంలోని గోష్పాద క్షేత్రం ఇంకా ముంపు లోనే ఉంది. బుధవారం మధ్యాహ్నం నుంచి వరద తీవ్రత నెమ్మదిస్తుండడంతో క్రమంగా వరద తగ్గుముఖం పడుతుంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద ఇంకా రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బుధవారం అర్ధరాత్రికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. గురువారం ఉదయానికి వరద ముంపు నుంచి గోష్పాద క్షేత్రం తేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం గోష్పాద క్షేత్రంలో అడుగు లోతు వరద నీరు ప్రవహిస్తోంది. అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి ఎవరినీ క్షేత్రంలోకి వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎర్ర కాలువ జోరు .. రైతన్న కన్నీరు

- బురదగా మారిన పలు గ్రామాలు
- ఉపాధి కరవై తల్లడిల్లుతున్న బాధితులు
- మండలంలో 7 వేల ఎకరాల్లో పంట నష్టం

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. చుట్టుముట్టిన వరదకు నాలుగు రోజులుగా కంటిమీద కునుకు లేకుండా గడిపిన మండలంలోని కంసాలిపాలెం, రావిమెట్ల, సింగవరం, ఆంజనేయపురం, తాళ్లపాలెం, తిమ్మరాజుపాలెం గ్రామాల్లోని కాలనీల వాసులు బుధవారం ఊపిరి పీల్చుకున్నారు. ఈ గ్రామాల పరిధిలోని పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. సుమారు 7 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రోజుల తరబడి పంటలు నీటిలో ఉండిపోవడంతో కుళ్లిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరద చుట్టుముట్టిన సింగవరం, తాళ్లపాలెం ఎస్సీ కాలనీ, రావిమెట్ల గ్రామాల్లో ఇళ్ల గోడలు దెబ్బతిన్నాయి. కాలనీలు బురదగా తయారయ్యాయి.



నిడదవోలు మండలం సింగవరం గ్రామంలో ఎర్ర కాలువ వరద ముంపులో చిక్కుకున్న పంట పొలాలు

రైతు కష్టం వరద పాలు..

ఎర్ర కాలువ వరద పోటుతో 7 వేల ఎకరాల్లోని వరి, చెరకు, అరటి, కూరగాయలు పంటలు నీట మునిగాయి. వారం రోజులు ముంపు నీరు కదలకపోవడం పంటలకు తీవ్ర నష్టాన్ని కలగజేసింది. ప్రధానంగా వరినాట్లు వేసి కొన్ని రోజుల మాత్రమే కావడంతో అవి పూర్తిగా కుళ్లిపోయాయి. పామాయిల్, అరటి తోటల్లో ఇసుక మేటలు వేయడంతో భారీగా నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టామని, ఎర్ర కాలువ నీరొచ్చి నిలువునా ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటకు పూర్తిగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎర్ర కాలువ ప్రవాహం రోడ్లపైకి చేరడంతో కంసాలిపాలెం–మాధవరం, కంసాలిపాలెం–సింగవరం, కంసాలిపాలెం–తిమ్మరాజుపాలెం, నిడదవోలు–యర్నగూడెం, నిడదవోలు–తాడేపల్లిగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మాధవరానికి వెళ్లే వంతెన పూర్తిగా పాడైంది. పలురోడ్లు గోతులుగా మారి ప్రమాదంగా తయారయ్యాయి.

ఉపాధి లేక అవస్థలు

పంటలు పూర్తిగా దెబ్బతినడంతో కూలీలు ఉపాధి కోల్పోయారు. ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో తలదాచుకునేందుకు కంసాలిపాలెం, శింగవరం గ్రామాల్లోని పలు కాలనీల ప్రజలు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. రెవెన్యూశాఖ, దాతల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేశారు. అయితే ఉపాధి కల్పించే వరకూ ముంపు గ్రామాల ప్రజలకు రేషన్‌తో పాటు నష్టపరిహారం ఇవ్వాలని పునరావాస బాధితులు కోరుతున్నారు.

సాగు వివరాల సేకరణపై వీఆర్వోలకు శిక్షణ

నల్లజర్ల: వ్యవసాయ కమతాలు, సాగు చేస్తున్న పంటల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని మండల సహాయ గణాంకాధికారి ఉప్పాటి చిన్ని వీఆర్వోలకు సూచించారు. రెండో దశ వ్యవసాయ గణనపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. 2021–22 సాగు సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకొని వివరాలు నమోదు చేయాలన్నారు. వ్యవసాయ గణనలో మండల స్థాయిలో సహాయ గణాంకాధికారులు, గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు ప్రాథమిక కార్యకర్తలుగా వ్యవహరిస్తారన్నారు. మండల సహాయ గణాంకాధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారన్నారు. ముందుగా వ్యవసాయ గణనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలను చిన్ని వివరించారు. వ్యవసాయ గణనకు సంబంధించి ఇన్‌పుట్ సర్వేలో రైతుల విద్యార్హతలు, వినియోగించిన పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటల బీమా, రైతు తీసుకున్న వ్యవసాయ రుణాల వంటి వివరాలు సేకరించాలన్నారు. 20 శాతం గ్రామాల్లోనే ఈ సర్వే జరుగుతుందన్నారు. తహసీల్దార్ పి.కృష్ణారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

తరగతి స్టాండర్డ్ మేరకు టీచర్ల బోధన

- వార్షిక తనిఖీల్లో ఈ విషయం పరిశీలిస్తున్నాం
- డీఈఓ వాసుదేవరావు



విలేకరులతో మాట్లాడుతున్న డీఈఓ వాసుదేవరావు

నల్లజర్ల: తమ తరగతులకు అనుగుణంగా విద్యార్థులందరికీ నైపుణ్యాలు అలవడుతున్నాయా? లేదా అనే విషయాలను వార్షిక తనిఖీల్లో పరిశీలిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన ప్రకాశరావుపాలెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు విలేకరులతో మాట్లాడారు. తనిఖీకి తానొక్కడినే కాకుండా ప్యానల్ బృందం వస్తోందన్నారు. ఏ సబ్జెక్ట్‌కు ఆ సబ్జెక్ట్ ప్యానల్ టీచర్ వచ్చి స్కూల్లో టీచర్ చెబుతున్న పాఠ్యాంశాలను గమనిస్తారన్నారు. జూలై నెలాఖరు నాటికి అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తయ్యిందా? లేదా ఆయా సబ్జెక్ట్ టీచర్లు నోట్స్ రాయిస్తున్నారా? లేదా? రాస్తే ఆ ఉపాధ్యాయుడు ఆ నోట్స్‌ను దిద్ది తప్పొప్పులు గుర్తించారా అనే విషయాలను పరిశీలిస్తారన్నారు. ప్రతి విద్యార్థీ ఆ తరగతి స్టాండర్డ్స్ కలిగి ఉన్నాడా లేదా? అని గుర్తిస్తున్నామన్నారు. విధంగా లేని విద్యార్థులకు పాఠాలు చెప్పుకుంటూ పోతే కొంతమంది వెనుకబడిపోతున్నారన్నారు. అలా వెనుకబడిన విద్యార్థుల పట్ల ఆయా సబ్జెక్ట్ టీచర్స్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారా? లేదా అనే విషయాలను హెచ్ఎంలు పర్యవేక్షించాలన్నారు. ఈ విధంగా తరగతిలోని విద్యార్థులందరికీ సమాన సామర్థ్యాలు వచ్చే వరకూ టీచర్లు ప్రయత్నించాలన్నారు. డీఈఓ వాసుదేవరావు ప్రకాశరావుపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మమేకమై ఉదయం నుంచి సాయంత్రం వరకూ ముచ్చటించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయనతో పాటు ఎంఈఓ–1వై.సత్యనారాయణ, ఎంఈఓ–2భగవతి, హెచ్ఎం జయశంకర్ ఉన్నారు.

హుండీ ఆదాయం రూ. 2.57 లక్షలు



అన్నవరప్పాడులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి వారి హుండీని బుధవారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీల ద్వారా 35 రోజులకు రూ.2.57 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఈ మొత్తానికి అదనంగా అన్నదాన హుండీ ద్వారా మరో రూ.6,580 ఆదాయం వచ్చిందని ఆయన చెప్పారు. హుండీల ద్వారా లభించిన ఆదాయాన్ని ఆలయాభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. గ్రామపెద్దలు, దాతల సహకారంతో ప్రతి శనివారం అన్నసమారాధన నిర్వహిస్తున్నామని చెప్పారు. తీపర్రు గ్రూపు ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎంవీ రామయ్య సమక్షంలో నిర్వహించిన హుండీల లెక్కింపులో అన్నవరప్పాడు గ్రామపెద్దలు పంతం చిన్న, పంతం నాగేశ్వరరావు, యాళ్లబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న, ఓసూరి బాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లైటింగ్, సప్లయి కంపెనీల ఓనర్ల సంఘ సమావేశం



తాళ్లపూడి మండల నూతన కార్యవర్గ సభ్యులతో తహసీల్దార్ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏఈ వెంకట్రావు తదితరులు

తాళ్లపూడి: సౌండ్, లైటింగ్, సప్లయి కంపెనీలను చిన్న తరహా పరిశ్రమలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరామని ఆ సంఘం మండల శాఖ గౌరవాధ్యక్షుడు ఎలుబోలు రాజు పేర్కొన్నారు. మండల సౌండ్, లైటింగ్, సప్లయి కంపెనీల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశాన్ని బుధవారం స్థానిక సొలస దమయంతి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. సంఘానికి గౌరవాధ్యక్షుడిగా ఎలుబోలు రాజు, అధ్యక్షుడిగా కొండే వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా డీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా గర్సికూటి వీరబ్రహ్మం, సంయుక్త కార్యదర్శిగా చేన్నా రామకృష్ణ, కోశాధికారిగా పెంటా శ్రీను ఎన్నికయ్యారు. అలాగే మద్దిల కృష్ణంరాజు, కొండ్రు రమణ తదితరులు కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. వారంతా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని, అధికారులను సత్కరించారు.

ఎంపీడీవో రమణారావు మృతికి నివాళి

ఉండ్రాజవరం: విధి నిర్వహణలో అనేక ఆటుపోట్లు ఎదురవుతాయని, వాటన్నింటినీ ధైర్యంగా తట్టుకుని నిలబడి విధులు నిర్వహించాలని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఆకాల మరణం పొందిన వెంకటరమణారావుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. రమణారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ భగవన్నారాయణ, ఉపాధి హామీ పథకం ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొవ్వాడ కాలువ తగ్గుముఖం

తాళ్లపూడి: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కొవ్వాడ కాలువ వరద కూడా నెమ్మదిస్తోంది. అయినప్పటికీ మండలంలోని వరి చేలు ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి. కొవ్వాడ కాలువ వరద, వర్షాల వల్ల మండలంలోని 1,448 ఎకరాల్లోని వరిచేలు ఇప్పటికీ ముంపులో ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. రాగోలపల్లి నుంచి తాడిపూడి వైపు వెళ్లే కల్వర్టుపై నుంచి, అన్నదేవరపేట నుంచి వేగేశ్వరపురం వైపునకు వెళ్లే కల్వర్టు, తిరుగుడుమెట్ట, వెంకటాయపాలెం వైపు వెళ్లే మరో కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. రాగోలపల్లి, తుపాకులగూడెం, బయ్యారం, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, పెద్దేవం , నల్లమిల్లిపాడు, పైడిమెట్ట తదితర గ్రామాల్లో వరి చేలు ముంపులో నుంచి తేరుకుంటున్నాయి. పల్లపు ప్రాంతాల్లో ముంపులోనే ఉన్నాయి.

ముందుగా సమాచారం ఇస్తే ముంపు నివారణ

మురుగు నీటి సమస్య గురించి రైతులు ముందుగానే సమాచారం ఇస్తే నివారణ చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పెద్దేవం, చిడిపి గ్రామాల వద్ద ముంపులో ఉన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. రోడ్డు పక్కనే ఉన్న బోదెలతో పాటు ఇతర బోదెలు కూడా పూడుపోవడంతో వర్షపు నీరు దిగువకు వెళ్లడం లేదని ఈ సందర్భంగా ఇక్కడి రైతులు తహసీల్దార్‌కు వివరించారు. ముంపు వల్ల కంద, అరటి, ఆకుకూరలు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లుతోందన్నారు. నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.



తిరుగుడుమెట్ట - పెద్దేవం రోడ్డులో ఇంకా ముంపులో ఉన్న వరి చేలు

సీఎం సహాయనిధికి 'శశి' విరాళం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని శశి విద్యాసంస్థల తరఫున ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందజేశారు. శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళం చెక్కు అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, శశి విద్యాసంస్థల డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ ఉన్నారు.



సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందిస్తున్న శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ

జాషువాకు ఘన నివాళి

కొవ్వూరు: తన రచనలతో సామాజిక స్ఫూర్తి నింపి, సమాజంలోని మూఢ నమ్మకాలపై తిరగబడిన కవి గుర్రం జాషువా అని దళిత నాయకుడు పెనుమాక జయ రాజు అన్నారు. బుధవారం జా షువా 51వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీసు జంక్షన్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జాషువా గొప్పతనం గురించి వక్తలు మాట్లాడారు. కె.పాల్ సుందరం, డి.వెంకటేశ్వరరావు, సీహెచ్ భాస్కరరావు, యేసురత్నం, కె.ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

